ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY


రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు

5★★★

ఆదివారం 31 మార్చి 2024

గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం 8

రైతులకు అండగా ఉంటాం 8





హాలీం..సలాం

- సర్వజనులకు ఎంతో ప్రియం
- అరబ్ దేశాల నుంచి తెలంగాణకు...
- రంజాన్ మాసం... నోరూరించే రుచులు
- జిల్లా ప్రధాన కూడళ్లలో ప్రత్యేక స్టాళ్లు
- ఆదివారం ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)


రంజాన్ మాసం వచ్చిందంటే ఎక్కడ చూసినా హలీమ్ ఘుమఘుమలు నోరూరిస్తాయి. ముస్లింలే కాదు కులమతాలకు పట్టింపు లేకుండా చిన్న పెద్ద, ఆడ, మగ, భేదం లేకుండా సర్వజనులకు హలీమ్ ఎంతో ప్రియంగా భావిస్తారు. వీటితో పాటు రంజాన్ సందర్భంగా తయారు చేసే వంటకాల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కూడళ్లలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం సందర్భంగా హలీమ్ రుచులను అందించడానికి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. రంజాన్ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం....

● హైదరాబాద్ నుంచి చిన్న నగరాలకు..

ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన హలీమ్ ఇప్పుడు చిన్నచిన్న నగరాల్లో సైతం లభిస్తోంది. ఇప్పటికీ రుచికరమైన హలీమ్‌కు మన హైదరాబాదే ప్రసిద్ధి గాంచింది. రుచులపరంగా కాకుండా కేలరీల పరంగా కూడా హలీమ్ ఎంతో ముఖ్యంగా చెప్పుకుంటారు. రోజా రోజుల్లో అందే రుచుల్లో ముఖ్యంగా ఉండే హలీమ్ అరబ్ దేశాల నుంచి తెలంగాణకు వచ్చింది. మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగానే హలీమ్‌ను కూడా రకరకాల వెరైటీలతో హోటల్ యజమానులు తయారు చేస్తున్నారు. 1866-1911 మధ్య కాలంలో నాటి నిజాం నవాబు తమ వంట శాలలో దీనిని ప్రత్యేకంగా తయారు చేయించి అతిథులకు వడ్డించేవారని చరిత్ర చెబుతోంది. హలీమ్ విక్రయ కేంద్రాలు మాత్రం 50 ఏళ్ల క్రితం మాత్రమే మొదలయ్యాయి.

● వెజిటేరియన్ హలీమ్...

శాకాహారులకు కూడా వెజిటేరియన్ హలీమ్ అందుబాటులోకి తెచ్చారు. ఫిష్ హలీమ్ తయారు చేసే విధానంలోనే దీనిని తయారు చేస్తారు. గోధుమరవ్వతో పాటు కొద్దిపాటి మసాలాను వినియోగిస్తారు. వండిన తరువాత చివరలో బీన్స్, క్యారెట్, కీరా, పచ్చి బఠానీలు కలిపి ఉడికిస్తారు. ఘాటుగా ఉండకుండా పెరుగుతో పాటు పాలు కలుపుతారు.



● జాఫ్రానీ హలీమ్...

జాఫ్రానీ హలీమ్‌లో గోధుమలు, మాంసం, నెయ్యితో పాటు కుంకుమపువ్వు వాడుతారు. దీంతో ఇది సుగంధం వెదజల్లుతుంది. అవసరమయిన వాళ్లు దీనిని ప్రత్యేకంగా తయారు చేయించుకుంటారు. ఎక్కువగా తింటే వేడి చేసే అవకాశం ఉంది.

● దక్కన్ హలీమ్...

నిజాం కాలంలో అరబ్బులు తయారు చేసే హలీమ్ పేరు దక్కన్, దక్కని పేర్లతో పిలిచేవారు. ఇందులో గోధుమలతో పాటు మాంసం మోతాదు రెండు నుంచి మూడింతలు వేస్తారు. గరం మసాలాతో పాటు లవంగం, ఇలాచీ, పప్పుదినుసులు కలిపి దీనిని తయారు చేస్తారు.

● ఇరానీ హలీమ్...

పాత కాలం వారు ఇప్పటికీ ఇరానీ హలీమ్ తయారు చేస్తున్నారు. ఇరానీ హలీమ్ ఘాటుగా ఉండదు. డ్రై ఫ్రూట్స్‌తో పాటు గోధుమలు, మినపప్పు, తక్కు మోతాదులో మసాలా దినుసులు వినియోగిస్తారు. ఈ హలీమ్ ఎక్కువగా పేస్ట్‌లా కాకుండా చిన్నచిన్న గింజలుగా ఉంటుంది.

● మటన్ హలీమ్...

గోధుమలు, మటన్‌తో పాటు శనగపప్పు, మినపప్పు, ఎర్రపప్పు కలిపి తయారు చేస్తారు. మసాలా దినుసులు కలిపి ఘాటుగా తయారు చేస్తారు.

● మరెన్నో రుచులు..

రంజాన్ పర్వదినాల్లో హలీమ్, హరీస్, రుచులతో పాటు మరెన్నో వంటకాలు ఘుమఘుమలాడుతాయి. దమ్ బిర్యానీతో పాటు డబుల్‌కా మీఠా, కబాబ్, సేమియా, కుర్బానీకా మీఠా, చికెన్ టిక్కాలు, తందూరి చికెన్, రుమాలీ రోటీ, రుచులను అందిస్తారు.

● హలీమ్ చరిత్ర...

వంద సంవత్సరాల క్రితం నిజాం రాజు తన వ్యక్తిగత సైన్యం కోసం యెమెన్, సౌదీ, అరబ్ దేశాల నుంచి రక్షకభటులను తెప్పించుకునేవారు. వారు ఇక్కడికి వచ్చిన తరువాత రోజూవారి ఆహారం కాకుండా ప్రత్యేకంగా తయారు చేయడానికి వంట మనుషులు కూడా వచ్చారు. వచ్చిన వారు సైనికులు ఎక్కువసేపు ఆహారం లేకుండా ఉండేందుకు గోధుమలు, నెయ్యి, మాంసంతో ఒక పదార్థాన్ని తయారు చేసేవారు. దానిని అప్పుడు హరీస్‌గా పిలిచేవారు. స్వచ్ఛమైన గోధుమలు, నెయ్యి, మాంసాన్ని సమభాగంలో ఉడికించి తినేవారు. కాలానుగుణంగా ఇక్కడే ఉండిపోయిన అరబ్బులు, నిజాం పండుగ వేడుకల్లో కూడా హరీస్‌ను తయారు చేయించి వడ్డించేవారు. నిజాం రాజ వంశీకుల ఇండ్లతో పాటు ప్రస్తుతం దేశ వ్యాప్తంగా హరీస్, హలీమ్ వంటకాలు ప్రసిద్ధి చెందాయి.



హలీమ్ తయారు చేస్తున్న దృశ్యం

వైభవంగా రాజరాజేశ్వరస్వామి రథోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తజనం

7



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

వేములవాడ టౌన్, మార్చి 30: వడ్డెర కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వేములవాడ పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసంలో జిల్లా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నిరుపేద వర్గానికి చెందిన వడ్డెరలను ఎస్టీలో చేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డి కొన్ని సందర్భాల్లో ప్రస్తావించారని, తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక కార్పొరేషన్ సహకరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్‌ను కలిసిన వారిలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపు లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు దండుగుల వంశీకృష్ణ, నాయకులు దండుకుల శంకర్, శివరాత్రి దేవయ్య, రాము, ఇసాక్, దుర్గయ్య, శ్రీనివాస్, నవీన్, దేవయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదోతరగతి పరీక్షలు



రుద్రంగిలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వేళ్తున్న విద్యార్థినులు

రుద్రంగి, మార్చి 30: ఈనెల 18న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. రుద్రంగి మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 184 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షల ప్రారంభం నుంచి చివరి వరకు ఎలాంటి ఆటంకాలులేకుండా నిర్వహించామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

వేములవాడ టౌన్ సీఐ పై బదిలీ వేటు

- విధుల్లో బాధ్యతారాహిత్యం.. అవినీతి ఆరోపణలు
- పట్టణ పోలీస్ స్టేషన్‌లో 11 మందిపై వేటు

సిరిసిల్ల క్రైం, మార్చి 30: వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ పై బదిలీ వేటు పడింది. గత ఏడాది జూలై మాసంలో బదిలీపై వచ్చిన కరుణాకర్ విధుల్లో బాధ్యతారాహిత్యం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో తొమ్మిదినెలలకే బదిలీ వేటు పడింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఇప్పటికే పలుమార్లు ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించినా పోలీస్ సిబ్బందిలో మార్పు రాకపోవడంతో బదిలీవేటు పడినట్లు తెలుస్తోంది. మహాశివరాత్రి జాతర సందర్భంగా వ్యాపారుల నుంచి నగదు వసూలు, సమస్యలపై వచ్చే ప్రజల పట్ల బాధ్యతారాహిత్యంగా నడుచుకోవడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారని తెలిసింది. అనేక ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన పోలీసు ఉన్నతాధికారులు చివరకు శనివారం ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ బదిలీ వేటు వేశారు. అయితే ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలోనూ విఫలమయ్యారని ఈ నెల 22వ తేదీన ఎస్పీ అఖిల్ మహజాన్ ఐదుగురు కానిస్టేబుల్, ఐదుగురు హోంగార్డుతో కలిపి మొత్తం పదిమందిని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఇదే సమయంలో ఎస్‌హెచ్‌వోకు ఛార్జ్ మెమో కూడా ఇచ్చారు. వారం రోజుల్లోనే వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ సంబంధించి 11 మందిపై చర్యలు తీసుకోవడం జిల్లాలో చర్చనీయాం శంగా మారింది. ఇప్పటికే సీఐ కరుణాకర్ సెలవులో ఉండగా ప్రస్తుతం ఇన్‌చార్జి సీఐగా రూరల్ సీఐ శ్రీనివాస్ కొనసాగుతున్నారు.

అర్హులందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు, పోలింగ్ రోజు అత్యవసర విధులు నిర్వర్తించే అర్హులైన వారందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరేన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పనకు జిల్లా కలెక్టర్ కృషి చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీఒక్కరు తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పించాలన్నారు. వీరి కోసం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం వద్ద తప్పనిసరిగా ఓటర్ ఫెలిసిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజున జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది పేరు ఎంప్లాయి కోడ్, హోదా మొబైల్ నంబర్, ఓటరు వివరాలు, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు, ఓటరు జాబితాలో పార్ట్ సీరియల్ నంబర్, ఓటరు గుర్తింపు కార్డు నంబర్లను రూపొందించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే సదురు ఉద్యోగులందరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్‌ను అందించే విధంగా అవసరమైన మేర అదనపు ఫారం- 12ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించే సమయంలో ఫారం-12ను అందజేసి ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలన్నారు. ఓటుహక్కును వినియోగించుకోవడం కోసం ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయడం జరుగుతుందని దీనికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, అర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఈవో రమేష్‌కుమార్, సంక్షేమాధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మృత్యుంజయం

గంభీరావుపేట, మార్చి 30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. కరీంనగర్ జిల్లా రాజకీయ పరిస్థితులపై మృత్యుంజయం చర్చించారు. కరీంనగర్ కాంగ్రెస్ లోకసభ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని మృత్యుంజయం కోరారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మృత్యుంజయం

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం: ఎస్పీ

తంగళ్లపల్లి, మార్చి 30: డ్రగ్స్ మహమ్మారిని తరిమి కోడదామని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ పిలుపునిచ్చారు. యువతలో డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన కల్పించేందుకు తంగళ్లపల్లి మండల మండెపల్లి కేసీఆర్ నగర్‌లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు యాంటీ డ్రగ్స్ అవగాహన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. శనివారం నిర్వహించిన టోర్నమెంట్ ఫైనల్స్ మ్యాచ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా అర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ టీమ్ విన్నర్‌గా నిలవగా, అంకుశాపూర్ క్రికెట్ టీమ్ రన్నర్‌గా నిలిచింది. గెలిచిన టీమ్‌కు ఎస్పీ అఖిల్ మహజన్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి యువతరాన్ని చెడు వ్యాసనాలకు దూరంగా సాంస్కృతిక కార్యక్రమాల వైపు ఆకట్టుకునేలా తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా, టీడీఎఫ్ కెనడాలు సంయుక్తంగా డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీ యన్నారు. డ్రగ్స్ మూలంగా సమాజం లో జరుగుతున్న దుష్పరిణామాల ను వివరిస్తూ మాదక ద్రవ్యాలను తరిమి కొట్టడానికి జిల్లాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు మట్టా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యాంటీ డ్రగ్స్ అవగాహన క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించమన్నారు. టీడీఎఫ్ కెనడాకు ప్రాతినిధ్యం వహిస్తున్న విక్రమ్ మాట్లాడుతూ క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు వంటి ఆరోగ్యకరమైన, నిర్మాణాత్మక కార్యకలాపాల్లో యువతను నిమగ్నం చేసి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్ఐ యాదగిరి, ఎస్ఐ సుధాకర్, యుఎస్ఏ బోర్డు మెంబర్ గిలిపెల్లి శ్రీనివాస్, టీడీఎఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ వినీల్, ప్రతినిధులు ఉన్నారు.



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహజన్

గురుకుల పాఠశాలల ఆకస్మిక తనిఖీ

తంగళ్లపల్లి, మార్చి 30: తంగళ్లపల్లి మండలంలో గురుకుల పాఠశాలలు, కళశాలలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, బద్దనపల్లి గురుకుల పాఠశాలలను మండల ప్రత్యేకాధికారి, డీపీవో వీరబుచ్చయ్య తనిఖీ చేశారు. భోజన వసతి, తాగునీరు తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ఇన్‌చార్జి ఎంపీడీవో జోగం రాజు మండల కేంద్రంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాల, నేరెళ్లలో గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 30: మండలంలోని బండలింగంపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ కిషన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే గ్రామానికి చెందిన కోడూరి మనోహర్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

రాజన్న ఆలయ బడ్జెట్ రూ. 186 కోట్లు

వేములవాడ, మార్చి 30: వచ్చే ఆర్థిక సంవత్సరంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం వార్షిక బడ్జెట్‌ను 186 కోట్ల రూపాయలుగా రూపొందించారు. ఈ మేరకు 2024-25 వార్షిక బడ్జెట్ అంచనాలను ఆలయ అధికారులు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో 186 కోట్ల, 68 లక్షల ఆదాయం, కాగా 185 కోట్ల 47 లక్షల వ్యయంతో కూడిన అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించామని ఆలయ కార్యనిర్వహణ అధికారి కృష్ణ ప్రసాద్ శనివారం తెలిపారు. ఇందులో స్వామివారి డిపాజిట్ల తిరిగి పెట్టుబడుల ద్వారా 18 కోట్లు, అభిషేకం, అన్నపూజ, కోడెమొక్కులతో పాటు ఇతర స్వామివారి సేవల ద్వారా 36 కోట్లు, హుండీ ఆదాయం ద్వారా 35 కోట్లు, ప్రసాదాల అమ్మకాల ద్వారా 24.50 కోట్లు, గోదాం సర్దుబాటులు ద్వారా 20 కోట్లు, లీజులు, లైసెన్సుల ద్వారా 22.35 కోట్లు, అన్నదానం విరాళాలు, డిపాజిట్ల ద్వారా 8.83 కోట్లు, డిపాజిట్లపై వడ్డీ ద్వారా ఐదు కోట్లు, రీకవరిలు ద్వారా 5.23 కోట్లు దత్తత దేవాలయాల ద్వారా మూడు కోట్లు, ధర్మశాలల అద్దెల ద్వారా నాలుగు కోట్లు, భారత్ గ్యాస్, కరీంనగర్లోని కల్యాణమండపం ద్వారా మూడు కోట్లు, విరాళాల సేకరణ ద్వారా 90 లక్షలు ఇతర ఆదాయాల ద్వారా 87 లక్షలుగా అంచనా వేస్తూ 186.68 కోట్ల ఆదాయంగా బడ్జెట్ రూపొందించారు. వ్యయానికి సంబంధించిన వివరాల్లోకి వెళితే తిరిగి పెట్టుబడులు కోసం 18.15 కోట్లు, జీతభత్యాలు, పరిపాలన వ్యయం 36 కోట్లు, స్వామివారి ప్రసాదాల తయారీ, ఇతరత్రా వాటికి కొనుగోలుకు 24.50 కోట్లు, సెంట్రల్ గోదాం సర్దుబాటుకు 20 కోట్లు, నూతన పెట్టుబడులు తొమ్మిది కోట్లు, ప్రభుత్వ చెల్లింపులు 21 కోట్లు, దత్తత దేవాలయాలకు 3.50 కోట్లు, నిర్మాణ పనులకు ఎనిమిది కోట్లు, విద్యుత్ నిర్వహణ, ఎలక్ట్రికల్ కొనుగోలు, నీటి నిర్వహణ 3.50 కోట్లు, శానిటేషన్ నిర్వహణకు 8.50 కోట్లు, భద్రత సిబ్బంది చెల్లింపులకు 3.20 కోట్లు, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భారత్ గ్యాస్ నిర్వహణకు గానూ మూడు కోట్లు, స్వామివారి నిత్యకల్యాణం భక్తులకు అందజేసే ప్రసాదాలు, ఇతరముల కోసం మూడు కోట్లు, ఆలయంలో వేడుకల నిర్వహణ నిమిత్తం మూడు కోట్లు, నాయీబ్రాహ్మణులకు ఇచ్చే కమిషన్, ఇతర కాంట్రాక్టు సిబ్బంది వేతనాలకు 2.20 కోట్లు, మరమ్మతుల నిర్వహణ కోటి రూపాయలు, చలివేంద్రాలు, చలువ పందిళ్ల కోసం 50 లక్షలతో పాటు ఇతర వ్యయాలు 22.42 కోట్లుగా అంచనాలు వేశారు.

నేడు మానసిక వైద్యుల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 30: భారత మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర సదస్సును నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ మానసిక వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భాగ్యరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మానసిక సమస్యలపై పరిశోధనల ఆవశ్యకత, మానసిక సమస్యలను ఎలా పసిగట్టాలి అనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శనివారం ప్రతిమ మల్టీప్లెక్స్‌లో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ కెకె లక్ష్మన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిషన్, ప్రధానకార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎన్‌డి సంజయ్‌కుమార్, కోశాధికారి డాక్టర్ పి సాయికృష్ణ, డాక్టర్ కె పవన్, డాక్టర్ బి పురుషోత్తం, డాక్టర్ జి ప్రీతి, డాక్టర్ ఎల్ వర్షి, డాక్టర్ ఎం పృథ్వీ, డాక్టర్ ఎన్ రవికుమార్ పాల్గొన్నారు.

బావిలో దూకిన వృద్ధురాలిని కాపాడిన దివ్యాంగుడు

శంకరపట్నం, మార్చి 30: శంకరపట్నం మండలం కొత్తగట్టులో బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలిని దివ్యాంగుడు కాపాడాడు. గ్రామానికి చెందిన గడ్డం మల్లమ్మ అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకింది. ఆ సమీయంలో పని చేసుకుంటున్న బండారి రవీందర్ అనే దివ్యాంగుడు గమనించాడు. వెంటనే తను బావి వద్దకు చేరుకొని ధైర్యం చేసి బావిలోకి దూకి వృద్ధురాలిని నీటిపైకి తీసుకువచ్చాడు. సుమారు 20నిమిషాల పాటు మోటర్ బెల్ట్ పట్టుకొని వృద్ధురాలు నీటిలో మునిగిపోకుండా పట్టుకున్నాడు. గ్రామస్థుల సహాయంతో వృద్ధురాలిని తాళ్లతో బయటకి తీశారు. కుటుంబ సభ్యులను వివరణ కోరగా కొంతకాలంగా వృద్ధు రాలి మానసిక స్థితి బాగా లేదని తెలిపారు. 108 సిబ్బంది వృద్ధురాలిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా రవీందర్‌ను గ్రామస్థులు అభినందించారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్ల కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్థ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్



(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్నిబట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయకులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్‌ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్‌ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమాయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

వైభవంగా రాజరాజేశ్వరస్వామి రథోత్సవం

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు



శ్రీస్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేములవాడ, మార్చి 20: వేములవాడ రాజరాజేశ్వరక్షేత్రంలో పార్వతీ రాజరాజేశ్వరస్వా మి వారల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాజరాజేశ్వరస్వామివారి దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న శివకల్యాణోత్సవంలో భాగంగా నాలుగోరోజు శనివారం సాయంత్రం ప్రధాన ఘట్టమైన స్వామివారల రథోత్సవాన్ని అశేష భక్తజనం మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథంపై దర్శనమిచ్చిన స్వామివారలను దర్శించుకున్నారు. రంగు రంగులపూలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన రథాలపై పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు రథ ప్రతిష్ఠ, రథహోమం, రథబలి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాల మధ్య పట్టణ వీధుల మీదుగా రథోత్సవం నిర్వహించగా, స్థానిక మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవం సందర్భంగా స్థానిక యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణప్రసాద్, ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఘనంగా యోగ నారసింహుడి ఏకాంతోత్సవం



స్వామివారల ఏకాంతోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

ధర్మపురి, మార్చి 30: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారల ఏకాంతోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అర్ధరాత్రి వేళలో ఉత్సవ మూర్తులను ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకెళ్లారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళలో వేంకటేశ్వర స్వామి వారల పుష్పయాగం కూడ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి 30: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయలో 2024-25లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పంకజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమై ఏప్రిల్ 15న ముగిస్తుందని తెలిపారు. 1-4-2024 నాటికి 6 నుంచి 8ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా బాలవాటికా- 1,2,3లో ప్రవేశాలకు 1 నుంచి ఏప్రిల్ 15 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మార్చి 31 నాటికి 6 ఏళ్ల లోపు వారు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గంజాయి పట్టివేత

హుజూరాబాద్, మార్చి 30: హుజూరాబాద్ పట్టణంలోని డిపో క్రాస్ వద్ద ఓ బాలుడి వద్ద గంజాయిని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. పట్టణానికి చెందిన ఓ బాలుడి వద్ద గంజాయిని పట్టుకొని బంధువుల సమక్షంలో విచారించి పంచనామా చేశామన్నారు. మైనర్ బాలుడి నుంచి ఒక కిలో 72గ్రాముల గంజాయిని సీజ్ చేసి డీపీవో చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ వద్ద బంధువుల సమక్షంలో హాజరు పరిచామని సీఐ రమేశ్ తెలిపారు.

రైతుల రాస్తారోకో

- వరదకాలువకు నీరు విడుదల చేయాలని డిమాండ్
- ఎమ్మెల్యే గేట్లు ఎత్తివేయించడంతో ఆందోళన విరమణ



రైతులను సముదాయిస్తున్న ఎస్సై

కథలాపూర్, మార్చి 30: వందలాది ఎకరాల పంటలు ఎండిపోతున్నాయని వెంటనే వరద కాలువ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దుంపెట శివారులో వరద కాలువపై రాస్తారోకో నిర్వహించారు. మేడిపల్లి, కథలాపూర్, భీమారం మండలాలకు చెందిన సుమారు వంద మంది రైతులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ప్రస్తుతం వరి పంటలు చేతికొచ్చే దశలో ఉన్నందు వల్ల నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ప్రజాప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు రైతులను కీలక సమయంలో ఆదుకోవాలని పేర్కొన్నారు. కథలాపూర్‌లోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అక్కడికి చేరుకుని జగ్గాసాగర్ వద్ద గేట్లు తెరిపించామని నీరు వస్తుందని చెప్పారు. అయినా నీరు వచ్చేదాకా ఇక్కడి నుంచి కదిలేది లేదని రైతులు భీష్మించుకుని కూర్చుండడంతో వేములవాడ - కోరుట్ల రహదారిపై బస్సులు, జీపులు, ద్విచక్ర వాహనాలు గంట సేపు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జగ్గాసాగర్ వద్ద నీటిని విడుదల చేసిన విషయం ఎస్సై నవీన్ రైతులకు వివరించడంతో రైతాంగం ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు నాయకులు పిడుగు ఆనం దరెడ్డి, తేలు రాజేందర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్ బార్డర్‌లో ఆర్మీ జవాన్ మృతి



రామకృష్ణ(ఫైల్)

సైదాపూర్, మార్చి 30: సైదాపూర్ మండలం గొడిశాల గ్రామానికి చెందిన నెల్లి రామకృష్ణ(27) అనే ఆర్మీ జవాన్ పాకిస్థాన్ బార్డర్‌లో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గొడిశాల గ్రామానికి చెందిన నెల్లి తిరుపతి-స్వరూపల కుమారుడు రామకృష్ణకు మూడేళ్ల క్రితం ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం వచ్చింది. కాగా జమ్ము కశ్మీర్‌లోని ఇండియా- పాకిస్థాన్ బార్డర్‌లో జేడీ(జనరల్ డ్యూటీ)గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం రామకృష్ణ మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. తమ కుమారుడు మృతి చెందడంతో తల్లి తండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. రామకృష్ణ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని అక్కడి అధికారులు ఫోన్‌లో కుటుంబ సభ్యులకు చెప్పినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. రామకృష్ణ మృతికి కారణాలు తెలియ రాలేదు. మృత దేహం గ్రామానికి చేరుకుంటే పూర్తి వివరాలు తెలిసే అవకాశముందని చెబుతున్నారు. కాగా ఆర్మీ జవాన్ నెల్లి రామకృష్ణ మృతికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాతృ భూమి రక్షణకు సైన్యంలో చేరిన రామకృష్ణ పాకిస్థాన్ బార్డర్‌లో మృతి చెందడం బాధాకరమని తెలిపారు. రామకృష్ణ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు.

బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయం రూ 30,64,396



ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహుడి హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి, మార్చి 30: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు శనివారం నిర్వహించగా రూ 30,64,396 ఆదాయం లభించింది. 14 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 57 గ్రాముల మిశ్రమ బంగారం, 5 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి, 7 విదేశీ నోట్లు లభించాయి. కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో ఘనంగా రుద్రయాగం

వేములవాడ, మార్చి 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం రుద్రయాగం ఘనంగా నిర్వహించారు. శివకల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు తీర్థరాజ పూజ, శ్రీస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు, అభిషేకములు, పారాయణాలు నిర్వహించారు. అనంతరం ఏకాదశ రుద్ర కలశ స్థాపనము అనంతరం రుద్రయాగం నిర్వహించారు. తదుపరి శ్రీశివపురాణ ప్రవచనం, ఔపాసనం అనంతరం వీరశైవ జంగమ అర్చకులు బలిహరణము గావించారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణమండపంలో శృంగార వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు భయం వీడి చదవాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 : విద్యార్థులు భయం వీడి చదివితే జయం సాధించవచ్చని సైకాలజిస్ట్ పున్నం చందర్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాచర్ల బొప్పాపూర్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు భయం వీడాలని అన్నారు. తమ శ్రమకు సరిపడా ఫలితం పొందాలంటే ధైర్యంతో పరీక్షలను ఎదుర్కోవాలని సూచించారు. చదివింది గుర్తుంచుకునే విధానాలపై మెళకువలను విద్యార్థులకు నేర్పించారు. జీవన నైపుణ్యాలు, కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సైకాలజిస్టు అలువల ఈశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మధుమాలతి, కెరీర్ గైడెన్స్ గైడ్ టీచర్ హజునాయక్, ఉపాధ్యాయులు మాలతి, రేవతి, బాలయ్య, రమేష్‌రెడ్డి, కిష్టారెడ్డి, సదానందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఎదగాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30: సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా యువత ఎదగాలని రెడ్ రిబ్బన్ క్లబ్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో యువత హెచ్ఐవీ, డ్రగ్స్ నివారణ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించి, ప్లకార్డులు, స్లోగన్‌లతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యువత హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవితమే యువతకు ముఖ్యమన్నారు. యువత విద్యార్థులు మత్తు పదార్థాలకు ఆకర్షితులు కావద్దని సూచించారు. ఎయిడ్స్ సంక్షోభంలో వ్యాధిగ్రస్తులకు అండగా ఉండాలని రెడ్ రిబ్బన్ చిహ్నంతో సంస్థను స్థాపించారన్నారు. అనంతరం సాంస్కృతిక పోటీల విజేతలకు, చైతన్యం క్రమశిక్షణ గల వలంటీర్లకు బహుమతులు అందజేశారు. అతిథులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మెంబర్ దుంపెన రమేశ్, ఎంబీబీఎస్ విద్యార్థి భరత్, ఉపన్యాసకులు మాదాసు చంద్రమౌళి, ఆర్ గీత, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, ఎండీ తాజోద్దీన్, కనిమేని దేవేందర్, లక్ష్మీ, రెడ్ రిబ్బన్ క్లబ్ సభ్యులు వలంటీర్లు కొమ్ము అరుణ్, బత్తుల వేదిత, బి జశ్వంత్, భానుశ్రీ, సల్మాన్ బాబా, సీహెచ్ రాకేష్, నాగరాజు, మహిత, కార్తీక్, అభిషేక్, అక్షర పాల్గొన్నారు.

విద్యుత్ మోటర్లను తొలగించాలని నిరసన

గంభీరావుపేట, మార్చి 30: గంభీరావుపేట మండల కేంద్రంలోని సెస్ కార్యాలయం ఎదుట శనివారం దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మానేరు వాగు వెంట నేతికుంటపల్లె శివారు ప్రాంతంలో అక్రమంగా విద్యుత్ మోటర్లతో నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై ఈ నెల 26న సెస్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంతో నిర్లక్ష్యం చేస్తున్న సెస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

కడియం శ్రీహరి, కేకే పదవులకు రాజీనామా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల రూరల్, మార్చి 30 : బీఆర్ఎస్ పార్టీతో పదవులను దక్కించుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు కేశవరావు(కేకే)లు వెంటనే వారి పదవులకు రాజీనామా చేసి మరోపార్టీలోకి వెళ్లాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన కడియం శ్రీహరిని ఓట్లు వేసి గెలిపించుకుంటే అ పార్టీలో ఉండి ప్రజలకు సేవలను అందించాల్సింది పోయి పార్టీ ఫిరాయింపు చేయడం సరైంది కాదన్నారు. కేశవరావుకు పిలిచి రాజ్యసభ పదవులు అందిస్తే బీఆర్ఎస్ పార్టీకి నమ్మకద్రోహం చేశారని అగ్రహం వ్యక్తం చేశారు. పార్టీని విడిచి వేరే పార్టీకి వెళ్లుతున్న వారు ముందుగా వారి పదువులకు రాజీనామా చేసి పోవాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత అవసరాల కోసమే పార్టీ మారుతున్నారే తప్ప ప్రజలకు కోసం కాదని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ వీడడం సరైందికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి విద్యార్థి విభాగం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎద్దుగుట్ట మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 30: ఎద్దుగుట్ట మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల కోసం పెద్దూర్, బోనాల గ్రామాల్లోని శ్రీకృష్ణ యాదవ సంఘాల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దూర్ గ్రామ శివారులోని ఎద్దుగుట్టపై ఉన్న మల్లికార్జున స్వామి ఎల్లమ్మ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి సోమవారం సాయంత్రం వరకు ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. దీనికోసం ఎద్దుగుట్ట పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు రెండు గ్రామాల నుంచి ఆలయం వరకు ఉన్న రోడ్లకు మున్సిపల్ అధికారులు విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు బోనాలు తీయడంతో పాటు రాత్రికి సుంకు బియ్యం, లగ్న పట్నం వేస్తారు. సోమవారం ఉదయం నాగవెళ్లి పట్నం వేసి ఎద్దుగుట్ట మల్లన్న ఎల్లమ్మల కల్యాణాన్ని ఒగ్గు పూజారులు నిర్వహిస్తారు.

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి



ధర్మారంలో మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

కోనరావుపేట, మార్చి 30: గ్రామాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో శనివారం పోలీస్ మీకోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలను నియంతించవచ్చని అన్నారు. కేసులను ఛేదించడానికి సులభం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకుడు మిరియాలకార్ బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం

- పేరుకుపోయిన చెత్త, మురికినీరు - ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం - ఎన్నికల బిజీలో ప్రత్యేక అధికారులు

వీర్నపల్లి, మార్చి 30: మారుమూల గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఏ గ్రామానికి వెళ్లినా మురికి కాలువలు, రోడ్లమీద చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం, ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో పలు గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా విఫలమైందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని మారుమూల తండాలు, పల్లెల్లో కూడా ఇదే పరిస్థితి కనబడుతోంది.

● దృష్టి సారించని ప్రత్యేక అధికారులు...

సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో నాయకుల పరిపాలన లేకుండా పోయింది. దీంతో ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. చాలా గ్రామాలకు ప్రత్యేక అధికారులు అడపాదడపా వెళ్లడంతో ఆయా గ్రామాలపై పట్టింపు లేకుండా పోయింది. ఇక కొన్ని గ్రామాల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ గ్రామాల పంచాయతీ కార్యదర్శుల పనితీరు అంతంత మాత్రమేనని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంకొన్ని గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది నామమాత్రంగానే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకావడంతో గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ఎన్నికల బిజీలో ఉండడంతో కేటాయించిన గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఎన్నికల పేరుతో సిబ్బంది కూడా మండల కార్యాలయానికి అంకితమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారులకు కేటాయించిన గ్రామాలవైపు అధికారులు వెళ్లకపోవడంతో ఉన్న సిబ్బంది కూడా విధులపై శ్రద్ధ చూపకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది.


వీర్నపల్లిలో అపరిశుభ్రంగా మంచినీటి ట్యాంక్, కంచర్లలో పేరుకుపోయిన మురుగు

● చెత్త ట్రాక్టర్ రాదు..

- దూది నర్సవ్వ, కంచర్ల గ్రామం



మా గ్రామంలో చెత్త తీసుకపోవడానికి గ్రామపంచాయతీ ట్రాక్టర్ రావడం లేదు. మా వీధిలో మురికి కాలువలు శుభ్రం చేయరు. సమస్యలు చెప్పుకుందామంటే అధికారులు ఎవరు రావడం లేదు. రోగాలబారిన పడితే ప్రభుత్వ వైద్యం సరిగా అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

● పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం..

- నరేష్ కుమార్, ఎంపీవో, వీర్నపల్లి



గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాము. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాము. సమస్యలు ఉన్న గ్రామాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేస్తాము. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాము. ప్రజలకు ఆరోగ్య సమస్యలు రాకుండా వైద్య సిబ్బందితో గ్రామాల్లో సర్వేలు చేస్తున్నాము.

బీజేపీ మండల అధికార ప్రతినిధిగా నిఖిల్


నియామక పత్రాన్ని అందుకుంటున్న నిఖిల్

వేములవాడ టౌన్, మార్చి 30: వేములవాడ అర్బన్ మండల అధికార ప్రతినిధిగా కాచం నిఖిల్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు శనివారం అందజేశారు. మండలంలోని సంకెపల్లి గ్రామానికి చెందిన కాచం నిఖిల్ బీజేపీలో ఎంతోకాలంగా పని చేస్తూ నిజాయితీగల కార్యకర్తగా పేరుతెచ్చుకున్నారన్నారు. దీనిని గుర్తించి నిఖిల్‌ను అధికార ప్రతినిధిగా నియమించామని మండల అధ్యక్షుడు పేర్కొన్నారు. నమ్మకంతో తనకు పదవిని అప్పగించిన జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు, మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకులు జింక అనిల్, జిల్లా నాయకులు చింతపల్లి మోహన్‌రావుకు నిఖిల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 30: ఇటీవల మండలంలో మృతి చెందిన పలువురి కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం పరామర్శించారు. రాచర్ల బొప్పాపూర్ పార్టీ యూత్ నాయకుడు కేశవ్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి అనారోగ్యంతో, అక్కపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త గజన్ లాల్ అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాలను ఆగయ్య పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరస కృష్ణహరి, ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బోనాల శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

-ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి


మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి

తంగళ్లపల్లి, మార్చి 30: ప్రతీఒక్కరు ఎన్నికల నియమావళిని తప్పనిసారిగా పాటించాలని ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి అన్నారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో లోక్‌సభ ఎన్నికల నియమావళిపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ సదన్‌కుమార్, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, మార్చి 30: సిరిసిల్ల నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు ఉత్కంఠగా సాగాయి. శనివారం జిల్లా కేంద్రంలోని నాయీబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో పోలింగ్ కౌంటింగ్‌ను నిర్వహించారు. 340 ఓట్లుకు గాను 300 ఓట్లు పోలైనాయి. అధ్యక్షుడిగా సమ్మెట శ్రీనివాస్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా కోత్వాల్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జనుపాల శంకరయ్య, అందే రమేష్ వ్యహరించారు. గెలుపొందిన శ్రీనివాస్, ప్రసాద్‌ను సంఘం నాయకులు అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి


సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో శశికళ

కోనరావుపేట, మార్చి 30: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోనరావుపేట ఎంపీడీవో శశికళ అన్నారు. మండలంలోని ధర్మారం ఎస్సీ హాస్టల్‌ను శనివారం ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మంచి విద్యను అందించాలని అన్నారు. ప్రతిరోజు వంట చేయడంలో మెనూ పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ వసతులను పరిశీలించారు.

రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటాం



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణారెడ్డి


రైతులకు రుణాలను అందజేస్తున్న చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి

ఎల్లారెడ్డిపేట, మార్చి 30: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, తిమ్మాపూర్ సింగిల్‌విండో చైర్మన్ రామగిరి సుధీర్‌రావు అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట, తిమ్మాపూర్ సింగిల్‌విండోల మహాజన సభలు శనివారం నిర్వహించి, ఆదాయ వ్యయ నివేదికలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సింగిల్‌విండోల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు సబ్సిడీ ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే రైతుల పిల్లల ఉన్నత విద్యకు, గృహ నిర్మాణానికి రుణాలతో పాటు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందజేస్తున్నామన్నారు. సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. రుణాల చెల్లింపునకు సంబంధించి వన్‌టైమ్ సెటిల్మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్లారెడ్డిపేట సొసైటీ పరిధిలోని సర్వేపల్లి పెట్రోల్ బంక్ త్వరలోనే పునఃప్రారంభించబోతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డిపేట, తిమ్మాపూర్ సొసైటీల వైస్‌చైర్మన్లు జంగిటి సత్తయ్య, బుగ్గ కృష్ణమూర్తి, సెక్రటరీలు కిషోర్ కుమార్, శశివర్ధన్, డైరెక్టర్లు, గ్రామసంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: రైతుల సంక్షేమ కోసమే సహకార సంఘాలు పనిచేస్తున్నాయని వేములవాడ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి అన్నారు. వేములవాడ సింగిల్ విండో జనరల్‌బాడీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సింగిల్ విండో పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో రైతులకు క్వింటాళుకు రూ. 500 బోనస్ అందిస్తానని హామిచ్చిందని, ఈ పంట నుంచే అమలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం రైతులకు వ్యాపార, దీర్ఘకాలిక రుణాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ తిరుపతిరెడ్డి మాట్లాడారు. రైతుల భాగస్వామ్యంతోనే సింగిల్‌విండోలు అభివృద్ధి చెందుతాయన్నారు. రైతులతో కలిసి అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలని సూచించారు. రైతులకు గతంలో చెల్లించిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. సంఘ పరిధిలో రైతులకు పౌల్ట్రీ, డైరీతో పాటు ఇతరాత్ర రుణాలను అందిస్తున్నామని అన్నారు. సంఘంలో ఇప్పటి వరకు 3,610 మంది సభ్యులుగా ఉన్నారని, సంఘంలోని సభ్యులకు స్వల్పకాలిక రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, బంగారంపై, వ్యక్తిగత వ్యాపార అభివృద్ధికి రుణాలను అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ తూం కాంతారావు, సీఈవో మిట్ట లక్ష్మణ్, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి


సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 30: కాంగ్రెస్ పార్టీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పలువురు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శనివారం కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటి అధ్యక్షుడు చోప్పదండి ప్రకాష్ అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులు బీజేపీ ప్రభుత్వం పై నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి ఐటి ద్వారా రూ. 1823 కోట్ల పెనాల్టీని వెంటనే చెల్లించాలని నోటీసులు పంపడం రాజకీయ కక్షలో భాగమేనన్నారు. బీజేపీ ప్రభుత్వం ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీకి ఐటీ నోటీసులు జారీ చేశారన్నారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి గుణపాఠం చేప్పడం ఖాయమన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ అకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, వైద్యశివప్రసాద్, యెల్లే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చీర్లవంచలో పౌరహక్కుల దినోత్సవం

తంగళ్లపల్లి, మార్చి 30: తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు గ్లాసుల విధానం ఉందా, దేవాలయాల్లోకి అనుమతి తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామస్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జోగం రాజు, ఆర్ఐ మధు, జలేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి క్లోరినేషన్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి, మార్చి 30: గ్రామ పంచాయతీల్లో రక్షిత మంచినీటి సరఫరా క్లోరినేషన్‌పై తంగళ్లపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు మిషన్ భగీరథ అధికారులు అవగహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ఏ విధంగా నీటిని క్లోరినేషన్ చేయాలో మిషన్ భగీరథ ఇంజనీర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్ వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపీడీవో జోగం రాజు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప వేడుకలు


ఒగ్గు డోలు కళాకారుల నృత్యాలు

చందుర్తి మార్చి 30: చందుర్తి మండల కేంద్రంలో బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. బీరప్ప ఉత్సవాల్లో భాగంగా యాదవ కులస్తులు బావిలో దాచిన బీరప్ప ప్రతిమలను, బీరప్ప కళాకారులు ఒగ్గు డోలు చప్పుళ్లతో నృత్యాలతో ఆటలతో విన్యాసాలతో బావి వద్దకు వెళ్లి తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం కుల నాయకులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యంపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ - స్వీప్ కార్యక్రమాలపై సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 30: ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోనేలా ఓటు ప్రాముఖ్యంపై వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో శనివారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో పార్లమెంట్ ఎన్నికలో పోలింగ్ శాతం పెరిగేలా స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై స్వీప్ కోర్ కమిటీ, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్, చునావ్ పాఠశాల ఓటర్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ చేపట్టాల్సిన కార్యక్రమాల కార్యాచరణను స్వీప్ నోడల్ అధికారి అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్ వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో మొత్తం 4లక్షల 70వేల 438 మంది ఓటర్లు ఉన్నారని ప్రతి ఒక్క ఓటరు ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్లను చైతన్యపరిచేందుకు ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు ఓటర్ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదు అయ్యే విధంగా ఓటు ప్రాముఖ్యం అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదు అయిన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల జిల్లాలో 77.71 శాతం పోలింగ్ నమోదు అయిందని, వేములవాడ నియోజకవర్గంలో 13 పోలింగ్ కేంద్రాల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో 38 పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్ర స్థాయి కంటే తక్కువ పోలింగ్ నమోదు అయ్యిందన్నారు. వీటి పరిధిలో ప్రత్యేకంగా స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసి వారు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభలను ఏర్పాటు చేసి ఓటరు నమోదు, వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో స్వీప్ కోర్ కమిటీ సభ్యులు జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీదర్, లక్ష్మీనారాయణ, డీఈవో రమేష్‌కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, రామదాసు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్